మధుర ఫలం.. విషతుల్యం

- పండ్లను మగ్గబెట్టేందుకు రసాయనాల వినియోగం
- ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న కెమికల్స్
- రైపెనింగ్ చాంబర్ల ఏర్పాటు పట్ల ఆసక్తి చూపని రైతులు


రసాయనాలతో మాగబెట్టిన మామిడి పండ్లు


అరటి పండ్లు

కపిలేశ్వరపురం: ఆహారంలో పండ్లకు అధిక ప్రాధాన్యం కలదు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగిన నేపథ్యంలో రోజువారీ ఆహారంలో జామ, బొప్పాయి, దానిమ్మ, కమలా తదితర పండ్లను తీసుకుంటున్నారు. వైద్యులు, న్యూట్రిషియన్లు సైతం పండ్లు, గింజల (నానబెట్టిన సీడ్స్)ను తినమంటూ అవగాహన సైతం కల్పిస్తున్నారు. శాకాహారం తీసుకునేవారు రోజుమొత్తంలో పండ్లను ఎక్కువగా భుజిస్తారు. తినే పండ్లలో ఆరోగ్యశాతమెంతన్న ప్రశ్న వినియోగదారులను వేధిస్తుంది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో అరటి పండ్ల విక్రయాలు నిత్యం జరుగుతాయి. మరికొద్ది రోజుల్లో మామిడి పండ్ల విక్రయాలు సైతం ప్రారంభంకానున్నాయి. మార్కెట్‌లో పండ్లను మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్, ఇథీఫాన్ లిక్విడ్‌లను వినియోగిస్తుండటంతో ఫలాలు విషతుల్యమవుతున్నాయి. పోషకాలతో పాటు విషపదార్థాలు శరీరంలోకి వెళ్లడం ద్వారా ఆరోగ్యం దెబ్బతింటోంది.

రెండు నియోజకవర్గాల్లో జోరుగా విక్రయాలు

ఏటా దివాన్ చెరువు, రావులపాలెం నుంచి తెచ్చిన మామిడి పండ్లను రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు ఆయా నియోజకవర్గాల గ్రామాల్లో విక్రయాలు సాగిస్తుంటారు. స్థానిక వ్యవసాయ క్షేత్రాలతో పాటు ఇతర ప్రాంతాల పండ్లను ఆయా మార్కెట్లలో విక్రయిస్తున్నారు. మండపేట నియోజకవర్గంలో 60, ఇతర కోనసీమ ప్రాంతంలో 90 మొత్తం 150 ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. అరటి సాగు సైతం ఇక్కడ ఎక్కువే. కొత్తపేట మండలంలో 2,890 ఎకరాలు, రావులపాలెంలో 3,242, ఆత్రేయపురం 3,948, కపిలేశ్వరపురం 667, మండపేట 71, ఆలమూరు 1,100 మొత్తం 11,918 ఎకరాల్లో రైతులు అరటి సాగు చేస్తున్నారు. నున్న, రాజోలు ప్రాంతాల నుంచి మామిడి, ఏలేశ్వరం నుంచి అరటి దిగుమతి అవుతోంది.

రసాయనాల వినియోగం ఇలా...

ఉత్పత్తి అయిన వ్యవసాయ క్షేత్రం నుంచి వినియోగదారుడికి పండ్లు చేరే మధ్యలో మార్కెట్ కీలకమైనది. పండు చెట్టుమీదనే పరిపక్వతకు వచ్చాక తినడమనేది దాదాపు సాధ్యం కాదు. పచ్చిగా ఉండగానే వాటిని ప్రకృతి సిద్ధంగా మాగబెట్టి మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంది. అయితే సమయానుకూలత వల్ల దళారులు రసాయనాల వినియోగం ద్వారా పండ్లను మాగబెడుతున్నారు. మామాడి పండ్లకు కాల్షియం కార్బైడ్, అరటికి ఇథెఫాన్ లిక్విడ్‌లను స్ప్రే చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా మార్కెట్‌కు, రైతుకు మధ్య ఉన్న దళారీలే చేస్తున్నారు.

విజిలెన్స్ దాడులు

పండ్లను రసాయనాలతో మాగబెట్టి అమ్మడంపై విజిలెన్స్ శాఖ దాడులు నిర్వహించి కేసులను నమోదు చేస్తుంది. రసాయనాలు వినియోగించారా లేదా అనేది ఉద్యానశాఖాధికారులు నిర్ధారించగా సంబంధిత అధికారులు చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటారు. పండ్లు విషతుల్యం కాకుండా ఉండేందుకు ప్రకృతిసిద్ధమైన రైపెనింగ్ చాంబర్లలో పండ్లను మాగబెట్టి విక్రయించడం మేలు.

సహజసిద్ధంగా పండిన పండును గుర్తించండి ఇలా...

సహజసిద్ధంగా మాగిన మామిడి పండ్లు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వత చెంది ఉంటుంది. కమ్మని వాసనను మనం దూరంగా ఉన్నప్పటికీ గ్రహహించగలుగుతాం. సహజసిద్ధమైన తీపి ఎక్కువగా ఉంటుంది. రసాయనాలతో మాగించిన పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటుంది. పైకి మాగినట్టు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటుంది. కమ్మని వాసన ముక్కుదగ్గర ఉంచినప్పుడు మాత్రమే వస్తుంది. తక్కువ తీపి ఉంటుంది.

ఆరోగ్య సమస్యలు వస్తాయి



కార్షియం కార్బైడ్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. దాంతో మగ్గబెట్టిన పండ్లు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలొస్తాయి. రోజూ పండ్లు తినేవారు సహజసిద్ధంగా పండించిన పండ్లు తినడం మేలు. ప్రత్యామ్నాయంగా ఎథిలిన్ హార్మోన్ స్ప్రే చేయొచ్చు. రైపెనింగ్ సెంటర్లు ప్రయోజనకరంగా ఉంటాయి. అరటి ఎగుమతులకు డిమాండ్‌తో కూడిన మార్కెట్ లభిస్తుండటంతో స్థానిక ఉద్యాన రైతులు ఏ రోజుకు ఆరోజు అరటి ఉత్పత్తులను అమ్ముకొంటున్నారు. కేంద్రాల నిర్వహణ పట్ల వారు ఆసక్తి చూపడం లేదు.

దాక్టర్ గంటా కోటేశ్వరరావు,
ఉద్యాన శాఖాధికారి, కొత్తపేట

క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం: పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు అధికారులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నిత్యావసరాల పంపిణీ


ఉండూరులో కుష్ఠు వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాలు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని 50 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులకు బెతెస్థ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసరాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రాజ్‌కుమార్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి చుక్కపల్లి రామకృష్ణ, కోశాధికారి మానుపాటి ప్రసాద్, అడబాల సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో వ్యవసాయ రంగం పురోగతి

కాజులూరు: యాంత్రీకరణతో వ్యవసాయ రంగం త్వరితగతిని పురోగతి చెందుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం కాజులూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా పలువురు రైతులకు 11 పవర్‌టిల్లర్ (చిన్న ట్రాక్టర్లు), ఏడుగురు రైతులకు పవర్‌స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణ ద్వారా పనులు సులభతరమవుతాయన్నారు. రాష్ట్రంలో 62 శాతం ప్రజలు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అందుకే ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి బడ్జెట్‌లో 43 వేల 402 కోట్లు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో శీల సర్పంచ్ కోమలి వెంకటరమణ, మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, వనుం వీరబ్రహ్మం, రెడ్డి శేషారావు, అంగర కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి మంత్రి భూమి పూజ


వెల్లలో కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో రూ.30 లక్షలతో కల్వర్టు, రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కల్వర్టు, రోడ్డుతో వెల్ల, ఏరుపల్లి, శీలంవారి సావరం, యనమదల తదితర గ్రామాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌జీఓ అసోసియేషన్ కార్యదర్శికి సత్కారం


కపిలేశ్వరపురంలో ఈశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, ఉద్యోగులు

కపిలేశ్వరపురం: ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ మండపేట యూనిట్ నూతన కార్యదర్శిగా కో ఆప్షన్ ద్వారా ఈ నెల 19న ఎన్నికైన ఆర్‌ఎంవీవీఎస్ ఈశ్వరరావును ప్రజాప్రతినిధులు, అసోసియేషన్ నాయకులు, సహచర ఉద్యోగులు సత్కరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు జిత్తుక మల్లికార్జునుడు అధ్యక్షతన నిర్వహించిన సత్కార సభకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలన్న డిమాండ్ సాధనకు ఏపీఎన్‌జీఓస్ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రత్నకుమారి, తహసీల్దార్ చిన్నారావు, సీడీపీఓ అధికారి గజలక్ష్మి, ఏఓ రమేష్‌కుమార్, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు కె.శివచక్రవర్తి, ఆర్‌ఎస్‌వీ కామేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు మార్చి నెల వేతనం అందలేదు

కపిలేశ్వరపురం: పారిశుధ్య కార్మికులకు మార్చి నెల వేతనాలు అందలేదని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమాల సమీక్ష సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చింది. ఎంపీడీఓ కె.రత్నకుమారి, తహసీల్దార్ చిన్నారావు, 19 గ్రామాల కార్యదర్శులతో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్‌లో మూడు వారాలు పూర్తయినప్పటికీ మార్చి నెల వేతనాలు చెల్లించకపోవడం సరికాదని, త్వరితగతిన చెల్లించాలని ఎమ్మెల్యే వేగుళ్ల గ్రామాల కార్యదర్శులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు సంబంధిత అధికారులు, సిబ్బంది పాటుపడాలని ఆదేశించారు. ప్రతి మూడో శనివారం చేపడుతున్న 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం పెరిగేలా కృషి చేయాలన్నారు. సిబ్బంది కొరత సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, నాయకులు పుత్సల శ్రీనివాస్, పువ్వుల చిట్టిబాబు, ఈవోపీఆర్‌డీ రాయుడు మోహన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ




ద్రాక్షారామ నుంచి రామచంద్రపురం ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం మండలం, రామచంద్రపురం పట్టణం, కె.గంగవరం, కాజులూరు మండలాల నుంచి ముస్లిం మత పెద్దలు, యువకులు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి వక్ఫ్ సవరణ చట్టం–2025 కు వ్యతిరేకంగా సోమవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ముందుగా ద్రాక్షారామలోని యానం సెంటర్ వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి బ్యానర్‌లు, ప్లకార్డులు చేతపట్టి రామచంద్రపురం పట్టణం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఖాదర్, పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

కేంద్రం నిరంకుశ వైఖరి విడనాడాలి

రామచంద్రపురం: వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని విడనాడాలని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖాదిర్ అన్నారు. భారత రాజ్యాంగ ఆర్టికల్ 25కి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేసిన వక్ఫ్ సవరణ చట్టాన్ని నిరసిస్తూ రామచంద్రపురం నియోజకవర్గంలోని ముస్లిం వక్ఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతృత్వంలో పట్టణంలోని ప్రధాన రహదారిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో డి.అఖిలకు వినతి పత్రాన్ని అందజేశారు.

దోమల పెంపకానికి కేరాఫ్ పంచాయతీ ఆఫీస్


ద్రాక్షారామ పంచాయతీ కార్యాలయం ముందున్న పంట కాలువ దుస్థితి

రామచంద్రపురం రూరల్: గ్రామ ప్రజలకు దోమల నిర్మూలన కోసం అవగాహన కల్పిస్తూ గ్రామం స్వచ్ఛంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాల్సిన గ్రామ పంచాయతీనే దోమల పెంపకం చేపట్టినట్లుంది ద్రాక్షారామలో పరిస్థితి. వివరాల్లోకి వెళితే మండలంలోనే మేజర్ పంచాయతీ రేపో మాపో నగర పంచాయతీగా అభివృద్ధి చెందాల్సిన ద్రాక్షారామలో పంచాయతీ కార్యాలయం పక్క నుంచే ఉన్న పంట బోదెను చూస్తుంటే మురుగుకాలువ కూడా సిగ్గు పడుతుంది. ఇక పంచాయతీ నుంచి అలా నాలుగు అడుగులు వేసి పంచాయతీ ఒకటో వార్డులోకి వెళదామంటూ అక్కడా మురుగునీరే స్వాగతం పలుకుతోంది. మురుగుకాలువ పొంగిపొర్లుతూ దుర్గంధం వెదజల్లుతుంటే పాపం ప్రజలు ముక్కు మూసుకుని వెళుతున్నారు. దోమలు ఇటువంటి మంచి చాన్స్‌లను వదులుకుంటాయా చక్కగా తమ సంతానాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ వివరణ కోరితే ఒకటో వార్డులో డ్రైనేజీ బాగు చేయిస్తామని, ఇక పంట కాలువ బాగు చేసే పని మాది కాదని సెలవిచ్చారు.


ద్రాక్షారామ ఒకటో వార్డుకు స్వాగతం పలుకుతున్న రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ధాన్యానికి మద్దతు ధర పెంచాలి


చేదువాడలో ధాన్యం రాశులపై నిలబడి నిరసన తెలియజేస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

కాజులూరు: ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర పెంచాలని ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. సోమవారం మండలంలోని చేదువాడ, ఒంటితాడి, శీల తదితర గ్రామాల్లో రాజబాబు తదితర రైతు సంఘాల నాయకులు పర్యటించి రైతులను కలుసుకున్నారు. శీలలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకీ పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో ధాన్యం మద్దతు ధర సరిపోక రైతుకి నికర ఆదాయం తగ్గి అప్పులపాలవుతున్నారన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1725 ప్రకటించినప్పటికీ మిల్లర్లు దళారులను ప్రోత్సహిస్తూ రూ.1600 కే కొనుగోలు చేస్తున్నారన్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రోత్సహించి రైతులు కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల కౌలు రైతు సంఘం నాయకులు బుడితి ప్రభాకరరావు, నామ చంద్రరావు, విరవాడ బాబ్జి, ఎస్.నూకరాజు, యాళ్ళ పుల్లయ్య, ఎం.యాకోబు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలు తీసుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

రామచంద్రపురం: డెంగీ వ్యాధి వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ముచ్చుమిల్లిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఆయన ప్రతి నెలా చేసే ల్యాబ్ పరీక్ష వివరాలను అడిగి తెలుసుకున్నారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల పట్టికను తనిఖీ చేశారు. అనంతరం రామచంద్రపురం పట్టణ ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా యాంటీ లార్వాల్ ఆపరేషన్లను చేపట్టాలని, నిల్వ ఉన్న మంచినీటిలో దోమలు గుడ్లు పెడతాయని వాటిని లార్వా దశలోనే నిర్మూలన చేయాలని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. డెంగీ, మలేరియా టెస్టులకు సంబంధించిన టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం డెంగీ, మలేరియా నివారణ, అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరీష్, పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హేమ సుధీర్, డాక్టర్ వీరభద్రారెడ్డి, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, సబ్ యూనిట్ ఆఫీసర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్ బి.మరియమ్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

లీజు ఇవ్వడం లేదంటూ ఆర్డీఓకు రైతుల ఫిర్యాదు


లీజు సమస్యపై ఆర్డీఓ మాధవికి ఫిర్యాదు చేస్తున్న కరవాక రైతులు

మామిడికుదురు: సముద్ర తీరంలోని కరవాకలో తమ వద్ద తీసుకున్న భూములకు ఓఎన్జీసీ లీజు ఇవ్వడం లేదంటూ రైతులు సోమవారం అమలాపురంలో ఆర్డీఓ మాధవికి ఫిర్యాదు చేశారు. 2022–23 నుంచి లీజు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. రేకడి శ్రీనివాసరావుతో పాటు పలువురు రైతులు ఆర్డీఓను కలసి తమ సమస్యను విన్నవించారు. 13 మంది రైతుల నుంచి 6.50 ఎకరాల భూమిని ఓఎన్జీసీ 2009–10వ సంవత్సరంలో లీజుకు తీసుకుందన్నారు. 2202–2021 నుంచి లీజులు చెల్లించేందుకు ఇబ్బంది పెట్టారన్నారు. 2022లో దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఓఎన్జీసీ వాహనాలను ఏడు రోజులు నిలిపి వేసి ధర్నా చేశామన్నారు. దీంతో దిగి వచ్చిన ఓఎన్జీసీ అధికారులు అప్పటి వరకు ఉన్న లీజు బకాయిలు చెల్లించారని చెప్పారు. మళ్లీ 2022–23 నుంచి లీజు ఇవ్వడం లేదని వాపోయారు. దీనిపై స్పందించి తమకు రావాల్సిన లీజు బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు న్యాయం జరగని పక్షంలో ఓఎన్జీసీ వాహనాలను మళ్లీ నిలిపివేసి ఆందోళన చేపడతామని అల్టిమేటం జారీ చేశారు.

ఆక్వా చెరువుల తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు


మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అయినవిల్లి: నేదునూరు, అయినవిల్లి గ్రామాల పరిసరాల్లో ఆక్వా చెరువుల తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని రైతులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ వద్ద ఆందోళన చేశారు. చాలా కాలంగా తాము వరి పంట సాగు చేసుకుంటూ రెండు పూటలా భోజనం చేస్తున్నామని అన్నారు.కొంత మంది రాజకీయ నాయకులు కుట్ర పూరితంగా రొయ్యల చెరువులుగా బంగారంలా పండే పంట భూములు మార్చేందుకు యత్నిస్తున్నారన్నారు. పంట చేలను రొయ్యల చెరువులుగా మారిస్తే తాము రోడ్డున పడతామన్నారు. అలాగే తమ చేలకు ఆనుకుని ఎండోమెంట్ భూములు ఉన్నాయన్నారు. మరి ప్రభుత్వాధికారులు ఆక్వా జోన్‌గా ఎలా మారుస్తారని వారు ప్రశ్నించారు. అనంతరం స్థానిక మండల వ్యవసాయ అధికారి వై.శోభకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో రైతులు వేగేశ్న వెంకన్నబాబురాజు, మిండగుదిటి శ్రీరామ్, ఈలి సత్తిబాబు, బావిశెట్టి ఆదినారాయణ పడుమట రామ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం


సుందరపల్లిలో రూ.లక్ష చెక్కు అందజేస్తున్న దాత

కె.గంగవరం: మండలంలోని సుందరపల్లిలో వేంచేసిన ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన దాతలు చిలకా సత్యనారాయణ, గీతా రాజ్యలక్ష్మి దంపతులు తమ స్నేహితుడు కాటూరి వీర్రాజు ద్వారా రూ.లక్ష ఆలయ కమిటీ చేతికి సోమవారం అందజేశారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

రామచంద్రపురం రూరల్: అదనపు కట్నం కోసం భర్త, అత్త, భర్త అమ్మమ్మలు వేధిస్తున్నారంటూ వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ సోమవారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెల్ల శివారు జానకిరావుపేటకు చెందిన నేదునూరి దివ్యకు కాజులూరు మండలం గొల్లపాలేనికి చెందిన వీరబాబుతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.3 లక్షలు, ఇతర లాంచనాలు అందజేశారు. ఇటీవల క్రికెట్ బెట్టింగులతో నష్ట పోయిన వీరబాబు అదనపు కట్నం తీసుకురావాలని తన తల్లి వెంకటలక్ష్మి, అమ్మమ్మ సూరమ్మలతో కలసి వేధింపులకు గురి చేస్తుండటంతో బాధిత మహిళ దివ్య ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


మాచరలో ఓసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కపిలేశ్వరపురం: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్టు అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధూర్ తెలిపారు. మాచరలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించతలపెట్టిన ఓసీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ సామాజిక భవనాలు స్థానికుల జీవన స్థితిగతులు మారేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ, నాయకులు గుడాల జయబాబు, పుత్సల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలపై డీవైఈఓ విచారణ

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పీఎంశ్రీ నిధులతో చేపట్టిన పనులు, మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్లు అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుతో కొత్తపేట డీవైఈఓ బి.రామలక్ష్మణమూర్తి సోమవారం విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎం కడలి సాయిరామ్ పీఎంశ్రీ నిధులు దుర్వినియోగం చేశారని, కోడిగుడ్లు అవకతవకలు జరిగాయని స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అంజిబాబు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడన్నారు. పీఎంశ్రీ నిధులతో విద్యార్థులతో పలు పనులు చేయించి బిల్లులు డ్రా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. దాంతో జిల్లా డీఈఓ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. పీఎంశ్రీ నిధుల ద్వారా రూ.18.70 లక్షల నిధులు మంజూరయ్యాయని వీటితో కెమిస్ట్రీ ల్యాబ్, గ్రౌండ్ అభివృద్ధి పనులు, రెయిలింగ్ తదితర పనులను చేశారన్నారు. ఫిర్యాదీ చేసిన ఆరోపణలపై పాఠశాలలోని ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థుల నుంచి వివరాలు సేకరించామన్నారు. ఈ నివేదికను డీఈఓకు అందిస్తామన్నారు. దీనిపై హెచ్‌ఎంను వివరణ కోరగా పీఎంశ్రీ నిధులకు సంబంధించి అన్ని బిల్లులు సక్రమంగా ఉన్నాయని, దానిపై ఆడిట్ జరిగిందన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

మలికిపురం: యువత వ్యసనాలకు బానిస కాకుండా సన్మార్గంలో నడవాలని సినీ క్యారక్టర్ ఆర్టిస్ట్ ప్రదీప్ అన్నారు. మలికిపురం డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతకు, విద్యార్థులకు కుటుంబ వ్యవస్థలో భార్యాభర్తలకు కావలసిన పలు సూచనలు ఆయన చేశారు. నేటి యువత చెడు అలవాట్లకు వ్యసనాలకు బానిస కాకుండా వాటిని ఏ విధంగా దూరం చేసుకోవాలనే అంశాలపై ప్రసంగించారు. సంస్థ చైర్మన్ ఈద సామ్యూల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా ఆ సంస్థ సభ్యులు, కాలేజీ కరస్పాండెంట్ మంగెన సత్యనారాయణమూర్తి, జీఎన్నార్ సంస్థ అధ్యక్షుడు గెద్దాడ నాగేశ్వరరావు, మలికిపురం సర్పంచ్ గడ్డం రాజ్యలక్ష్మి, కాలేజీ ప్రిన్సిపాల్ నల్లి ఆనందమహాని తదితరులు పాల్గొన్నారు.

కోర్సులపై అవగాహన కలిగి ఉండాలి

అంబాజీపేట: విద్యార్థులు భవిష్యత్‌లో ఉపయోగపడే కోర్సులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండి వాటినే ఎంచుకుని శ్రద్ధగా చదువుకుంటే బంగారు బాట అవుతుందని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఒకేషనల్ కోర్సులో భాగంగా 12 రోజుల పాటు నిర్వహించిన ఇంటర్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులకు హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన ట్రైనింగ్ సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో డీవైఈఓ బి.లక్ష్మణమూర్తి, జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఎంఏకే భీమారావు, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఒకేషనల్ టీచర్స్ జి.తేజస్విని, వై.స్టీఫెన్, వై.వివేక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.